కథానిక

# ఆముష్మిక వైరం

"వనశ్రీ"

జగద్గురువులూ, మహాఋషీ అయిన చిదానంద స్వాములవారి ఆశ్రమానికి ఒకానొక రోజున వడ్రంగి మల్లయ్య తన చిరకాల వాంఛితాన్ని నెరవేర్చుకోనేందుగ్గాను వచ్చాడు.

తపో నిష్ఠాగరిష్ఠులయిన చిదానందులవారి దర్శనం సామాన్యులకు దుర్లభం! సంవత్సరానికి ఒకసారి మాత్రమే జగద్గురువులు, బ్రహ్మతేజస్కులూ అయిన చిదానందులవారి దర్శన మహాభాగ్యం ప్రియశిష్యగణానికీ, భక్తకోటికీ, పామర జనానికీ లభించేది. కాని మూడు సంవత్సరాలగా స్వాములవారు ఆ మాత్రపు దర్శనమేనా యివ్వలేదు.

ఆ పరమరహస్యం మహాపురుషుల ప్రియతమ శిష్యులైన నిత్యానంద గురువులకు, సదానంద గురువులకు తప్ప మరో ప్రాణికి తెలియదు. నిజానికి ఆశ్రమపరిపాలనంతా నిత్యానందులూ, సదానందుల చేతులమీదగానే జరిగిపోతోంది.

నిత్యానందులు పూర్వచరిత్రలో ఓ ధనిక భూస్వామి. సంతులేని కారణంగా, తన ఆస్తిలో ఒక్క చిల్లి కానీకూడా దాయాదులకు చిక్కకుండా సర్వస్వాన్నీ ధర్మకార్యాలకు వినియోగించి సన్యాసాశ్రమం స్వీకరించి ఆశ్రమవాసి అయినాడు.

సదానందులు గత చరిత్రలో ఓమిల్లు యజమాని, పెద్ద కుటుంబానికి వారసుడు. వ్యాపారంలో నష్టంరాగా ఐ. పి. పెట్టి మిగిలిన ఆస్తిని పెళ్ళాం బిడ్డలకు ఒప్పచెప్పి ఆశ్రమవాసాన్ని స్వీకరించారు.

నిర్ధనులై వుండియూ, త్యాగధనులైన వాళ్ళిద్దరకూ జగద్గురువులు, ఉపగురువుల పీఠాన్ని త్వరలోనే — అనతికాలంలోనే ప్రసాదించారు.

"అహం"న్ని చంపుకొని ఐహికాన్ని ఆముష్మికంకోసం బలిదానంచేసి, తుచ్ఛశరీరాన్ని పరమాత్మకు బానిసను చేసిన సదానందులు, నిత్యానందులు (ఆ పేర్లు వాళ్ళకు జగద్గురువు చిదానందులు ప్రసాదించినవి) ఆశ్రమవాసుల అంతరంగాల్ని చూరగొన్నారు.

మూడు సంవత్సరాలగా జగద్గురువులు దర్శనం యివ్వనందువల్ల దర్శనార్థం వచ్చిన యాత్రీకులు, భక్తతటికి పాదపూజార్హులైన జగద్గురువుల తర్వాత గురువు లంతటివారు సదానందులవారా, నిత్యానందులవారా అన్న ధర్మసందేహం కలిగింది. తీర్థకోటిలో బయలుదేరిన ఆ ధర్మసందేహము ఆశ్రమవాసుల్లోకే ప్రవేశించింది.

ఆ ధర్మసందేహం తుచ్ఛసంశయంగా మారి ఆశ్రమవాసుల్లో అలజడికలిగించడమే కాక చిన్న గురువుల మనశ్శాంతికి భగ్నం కలిగించింది.

జగద్గురువుల స్థానాన్ని ఆక్రమించగలిగిందీ, పాదసేవార్హత కలిగిందీ ఒక్క నిత్యానందులవారేనని ఆశ్రమవాసుల్లో కొంతమంది, సదానందులవారేనని మరి కొంతమంది అభిప్రాయపడటమేకాకుండా వాదోపవాదాలుచేసేదాకా పోయారు.

చూస్తూండగానే ఆశ్రమం రెండు పక్షాలుగా ఏర్పడిపోయింది. నిత్యానందుల పక్షీకులకు, నిత్యానందుల ప్రియతమ శిష్యుడైన "సత్తు" నాయకత్వం వహించాడు. అలాగే సదానంద వర్గీయులకు "చిత్తు" నాయకత్వం వహించాడు. (ఈ సత్తూ, చిత్తూ పేర్లు వాళ్ళ పెట్టుకొన్నవే కాదు. సాక్షాత్తు జగద్గురువులే వాళ్ళు ఆశ్రమంలో చేరాక నామకరణం చేశారు కాబట్టి ఎవరికీ అధిక్షేపించే తాహతులేదు.)

జగద్గురువులు తన తదనంతరం పీఠాధిపత్యం నిత్యానందులవారికే చెందాలని రహస్యంగా తన గురువుల చెవులో వూదినట్టు సత్తు బహిరంగంగా ప్రచారం చేయడం మొదలెట్టాడు. చిత్తు మాత్రం తక్కువతిన్నవాడేమీ కాకపోబట్టి తన గురువులైన సదానందులవారికే ఆ అగ్రస్థానం దక్కాలని జగద్గురువులు అభిప్రాయపడినట్లుగా తన గురువు తనతో చెప్పినట్టు ప్రచారం జోరుగా

సాగిస్తున్నాడు. కాని సదానందులు, నిత్యానందులు యిద్దరూ యిలాంటి నీచపు కోర్కెలకు అతీతులయినట్టు నింపాదిగా, గంభీరంగా ప్రవర్తిస్తున్నారు.

ఏమైనా, ప్రశాంతమైన ఆశ్రమ వాతావరణం దాలిపొయ్యిలా కుమలకపోయినా, బురద గుంటలా లోలోపలా కుళ్ళుకుంటూ వుంది.

అలాంటి పరిస్థితుల్లోవున్న ఆశ్రమంలోకి అడుగుపెట్టాడు వడ్రంగి మల్లయ్య వినయ విన్రమతలతో, గురువుల దర్శనంచేసుకొని పాదధూళి నెత్తిన వేసుకొని జన్మతరింప చేసుకుందామన్న చిరకాల వాంఛతో వచ్చానన్నాడు వడ్రంగి మల్లయ్య. ఒస్తూ కానుకగా గురువులకు రెండు జతల పావుకోళ్ళను, తన పనితనమంతా ఉపయోగించి అతి నగిషీగా తయారుచేసిన పావుకోళ్లను తీసుకొచ్చాడు.

మల్లయ్య వచ్చేసరికి సదానందులూ, నిత్యానందులూ ఒక రకమైన రాజీమార్గంగా, ఇద్దరూ సమానమైనవున్న ఆసనాలపై పక్కపక్కనే ఆశీనులై భక్తుల పూజలనూ, కానుకలనూ స్వీకరిస్తూ వున్నారు.

దబ్బపండువంటి శరీర ఛాయతో; దృఢకాయులూ, ఆజానుబాహులూ, జడలుగట్టిన గడ్డాలూ! పెరిగినగోళ్లు, బ్రహ్మతేజస్సూ, దర్భలూ, విభూతి, పూజాసామగ్రి, వేదఘోషా, పురాణ పఠనం, పులిచర్మాలూ, కందమూలాలూ, కౌపీనాలూ, కమండలాలూ, కుటీరాలూ, ఫలవృక్షాలూ - లేళ్లు, జింకలూ, పచ్చిగరికా, తూగమొక్కలూ - అవీ ఆశ్రమం. అదీవాతావరణం, అదీప్రాణులు, అదీజీవితం!

చిత్తూ, సత్తూ మొదలుగాగల బృందంతో పరివేష్టితమైన నిత్యానందులను, సదానందులను దర్శించి వడ్రంగి మల్లయ్య భక్తి ప్రపత్తులతో కానుకగా తెచ్చిన పావుకోళ్ళను సమర్పించుకొని గురువుల పాదధూళిని తలకెత్తుకొని సంతృప్తితో తేలికపడిన హృదయాన్ని మోసుకొని వచ్చిన దారినే చక్కాపోయాడు.

నున్నగా చక్కగా చెక్కబడిన ఆ పావుకోళ్ళపై శిష్య పరమాణువులదగ్గర్నుంచీ గురువుల వరకూ అందరికళ్ళూ ఓసారి పడినాయి. రంభనైనా మాసి చలించని మునిముచ్చుల మనసులు ఆ పావుకోళ్ళను చూసేసరికి చలించిపోయినాయి. సదానందులూ, నిత్యానందులూ వాటిని తాకి చూసి పరవశత్వం పొందినంతయ్యారు.

వడ్రంగి ఆ రెండుజతల పావుకోళ్ళను గురువులిద్దరిమధ్యనా పెట్టిపోయాడు. భక్తులసేవ లందుకొని, ఆశ్రితులకు తీర్థమిచ్చాక, నిత్యానందులు ముందుగా తన ఆసనంనుండి లేచినవారై ఒక జత పావుకోళ్ళను తొడుక్కొని 'సత్తు' మొదలుగా గల శిష్య పరమాణుబృందం వెంటరాగా తన కుటీరంకేసి నడిచి వెళ్ళారు. నిత్యానందులు వెళ్ళగానే సదానందులవారు మిగిలిన జత పావుకోళ్ళను ధరించి 'చిత్తు' ఆది శిష్యగణ సమేతంగా టకటకా, పావుకోళ్ళశబ్దం చేసుకొంటూ తన పర్ణశాలవైపు బయలుదేరారు.

కాని పాపం సదానందులవారు పదిగజాలు నడవకముందే విరుచుకు పడిపోయారు. ఆయన గారి ఎడం పాదంకింది పావుకోడు ఊడిసి పక్కకు తప్పుకోటంవల్ల పాదం మడతబడి సదానందులవారు విరుచుకుపడిపోటం జరిగింది. శిష్యులంతా ఆదుర్దాగా చుట్టూచేరి సపర్యలుచేశారు, చిత్తు గురువుగారి ఎడంపాదాన్ని రెండుచేతుల్లోకి తీసుకొని తన గుండెలపై నుంచుకొని మెల్లగా నిమిరి సరిచేశాడు.

నిత్యానందులవారి కుటీరంవైపు పోతూన్న శిష్యుల్లో కొంతమంది సదానందులు అలా విరుచుకు పడిపోటం చూసి వెకిలిగా నవ్వేరు. అలా నవ్వడం సదానందుని శిష్యుల్లో కొంతమంది కంట కూడా పడింది.

రెండోరోజున భక్తులకు తీర్థం ఇవ్వడం పూర్తికాగానే అవమానంతో దహించబడుతున్న సదానందులవారు ముందుగాలేచి వెళ్ళిపోయారు; శిష్యసమేతంగా, పావుకోళ్ళ శబ్దం చేసుకొంటూ.

సదానందులవారు వెళ్ళగానే నిత్యానందులు లేచి పావుకోళ్ళను ధరించి బయలుదేరారు. పదిగజాలు నడవకముందే ఆ క్రిందటిరోజు సదానందులకు జరిగిందే నిత్యానందులకూ జరిగింది. ఈసారి సదానందులని శిష్యులేగాక నిత్యానందులవారు కూడా వెనుదిరిగి ఒక విషపునవ్వు నవ్వేరు.

అది గమనించిన నిత్యానందులు దెబ్బతిన్న పెద్దపులిలా రుసరుసల్తో చరచరా తన కుటీరంలో జొరబడ్డాడు.

సత్తు, గురువుగారు వదిలేసిన పావుకోళ్ళను తీసుకొని మిగతా శిష్యులతో సహా నిద్యానందులకు తీరంలోకి వెళ్ళాడు. శిష్యులంతా గురువుగారి చుట్టూచేరి చర్చలు చేశారు. గురువులకు జరిగిన అవమానానికి తమ క్రోధాన్ని వెలిబుచ్చారు. ప్రతీకార ప్రతిజ్ఞలను తీసుకొనేదాకా కొంతమంది వెళ్ళారు. నిత్యానందులు అందరినీ వారించి శాంతి పరిచాడు. ప్రియశిష్యుడైన సత్తు దీర్ఘంగా పావుకోళ్ళను పరీక్షించి, తేల్చిచెప్పాడు; ఆ పావుకోళ్ళు గురువుగారివి కావని.

ఎడంకాలి పావుకోడుమీద బొటనవ్రేలిదగ్గర వున్న పావు కొంచెం పెడగావుంది. అందుకే అది నడిచేప్పుడు పక్కకు తప్పుకొని బెడిసిపోతోంది. ముందు నిత్యానందులకు సమర్పించబడిన పావుకోళ్ళు మంచివేను. కాని ఆ రోజు సదానందులు ముందుగా లేచిపోతూ, పావుకోళ్ళను మార్చి తొడుక్కొని వెళ్లడం జరిగినట్టుంది. ఆ పని సదానందులవారు కావాలనే చేశారో, పొరపాటునే చేశారో మరి ఆయనగారి అంతరాత్మకే తెలియాలి!

కాని, నిత్యానందులూ, సత్తూ మొదలైన అనునాయులంతా నిత్యానందుల్ని అవమానపరచటానికే సదానందులు కావాలనిచేసిన మోసంగా నిర్ణయించుకున్నారు.

మూడురోజులు తర్వాత సదానందులవారు తమ కుటీరంలోంచి బయటికొస్తూండగా మళ్ళీ ఎడంకాలికింద పడివున్న పావుకోడు తప్పుకుంది.

అంటే ఆ క్రిందటిరాత్రి నిత్యానందులవారి శిష్యుడైన సత్తు సదానందుల కుటీరంలో జొరబడి ఆ మంచి పావుకోళ్లను సంగ్రహించుకుపోయాడు వాటికి బదులుగా రెండో జతను వుంచి.

నిత్యానందులు ఆ రోజున సగర్వంగా పావుకోళ్ళ ధ్వనిచేసుకొంటూ భక్తుల పాదపూజలు స్వీకరించటానికి వచ్చారు. సదానందులవారికి ముఖం వాడిపోయింది. ఆయనగారి అనునాయులు తలలు వాల్చుకు కూర్చొన్నారు. చిత్తుకు మెడకాయమీదనుంచి తలకాయే పోయినంత పని అయింది. నిత్యానందుల శిష్యుడు "సత్తు" వుత్సాహం చెప్పటానికి వీల్లేనంతగావుంది. గురువుగారు పావుకోళ్ళను విడువగానే తను తీసుకొని ఒళ్ళో పెట్టి కూర్చొంటున్నాడు సత్తు, మళ్ళీ వెళ్ళబోయేప్పుడు తనే స్వయంగా తొడుగుతున్నాడు.

ఇది గురువులు సదానందులవారి అనునాయులకు కదిలించి కారంరాసినట్టయింది. ప్రశాంతమైన ఆశ్రమ వాతావరణం అగ్నిగుండంలా కుములుతోంది. అగ్నికణం చల్లారకుండా యింధనమూ, సమిధలూ ఏదో రకంగా జేరుతూనే వున్నయ్. ఆశ్రమవాసుల గుండెల్లో తేళ్ళు కొండీలు ఎత్తుకొని తిరుగుతున్నాయ్! పాములు పడగలు విప్పుకొని బుసలుకొట్టూ వున్నయ్! ఒకరోజున సత్తుగాడిపట్టు కౌపీనం మాయమైంది! సత్తు తేలిగ్గానే వూహించగలిగాడు అది యెవరి పనై వుంటుందనేది.

రావిచెట్టు తొర్రలో దేన్నో దాచివస్తూన్న చిత్తుగాణ్ని లంకించుకొన్నాడు సత్తు. కసి కొద్దీ సత్తు, చిత్తుగాడి గోచిగుడ్డలాగి పేలికలు పేలికలుగాచించి పారేశాడు. చిత్తూ సత్తుగాడి గోచిపాత గుంజి అదేపనిచేశాడు.

సత్తూ, చిత్తూ బాహా బాహీకలబడ్డారు. సత్తువకొద్దీ సత్తుగాడు కొట్టినదెబ్బకు చిత్తుగాడు చిత్తుగా చిత్తయిపోయాడు: ఆదారినే వస్తూన్న సదానందులు చేతులో వున్న కమండలంతో సత్తుగాణ్ణి కణితలవేసి బాదేడు. సత్తుగాడు కెవ్వున కేకవేసి నేలకర్రుచుకొన్నాడు. ఎక్కడ్నుంచి వచ్చాడో మరి నిత్యానందులు మాంచి తాటిగరి మట్టతో వీపుపై బలంకొద్దీ చరచాడు. అప్పటికే సత్యానందుల వర్గంవాళ్ళు, సదానందుల వర్గంవాళ్ళు చేతికిదొరికిన ఆయుధాలతో తారసిల్లారు.

పవిత్రమైన ఆశ్రమవాటికలో శీతాఫలం చెట్ల కిందా పచ్చటినేలపైనా చీకటి ఎర్రటిరక్తపు మడుగులు హత్తుకొన్నాయి! హతోస్మి!

ఆ రక్తపు మడుగుల్లో పడివున్న నాలుగు పావుకోళ్ళు నిర్లిప్తంగా వినీలాకాశంలోకి చూస్తున్నయ్!

ఆ పావుకోళ్ళను చేసిన వడ్రంగి మల్లయ్యా కాశీ ఆశ్రమాన్ని నిర్మించిన ,జగద్గురువులు చిదానంద స్వాములవారుగానీ ఆ ప్రాంతంలోతర్వాతెప్పుడూ కనిపించలేదు. వినిపించలేదు.